ఈనాడు
పశ్చిమగోదావరి
బుధవారం అక్టోబరు 16, 2024 5

కొత్త సరకు సిద్ధం!

నేటి నుంచి ప్రైవేటుగా మద్యం విక్రయాలు

భీమవరం పట్టణం, ఆకివీడు, న్యూస్‌టుడే: నూతన విధానంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 175 దుకాణాల్లో బుధవారం నుంచి ప్రైవేటుగా మద్యం విక్రయాలు ప్రారంభం కానున్నాయి. లాటరీ ప్రక్రియలో దుకాణాలు దక్కించుకున్నవారంతా కొత్త సరకు రవాణా, విక్రయాలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మంగళవారం రాత్రి సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ ఆలస్యమైనా బుధవారం తెల్లారేసరికి దుకాణాలకు కొత్త మద్యం చేరేలా ఆబ్కారీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అద్దెల దరువు.. ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించిన గదుల్లోనే విక్రయాలు కొనసాగించేలా అధికశాతం వ్యాపారులు సిద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలతో తలెత్తిన ఇబ్బందులను స్థానికులు ఎన్నికల సమయంలో కూటమి నాయకుల దృష్టికి తీసుకురాగా వాటిని తొలగింపజేస్తామని హామీ ఇచ్చారు. అలాంటి దుకాణాలు మాత్రం ఇతర ప్రాంతాలకు తరలే అవకాశాలున్నాయి. మరోపక్క కొన్ని ప్రాంతాల్లో దుకాణాల యజమానులు అద్దెలను నాలుగైదు రెట్లు పెంచి చెప్పడంతో వ్యాపారులు అవాక్కవుతున్నారు.

సామగ్రి స్వాధీనం.. ప్రభుత్వ దుకాణాలకు గతంలో సమకూర్చిన కంప్యూటర్లు, ట్యాబ్‌లు, స్కానర్లు, ఫ్రిజ్ తదితర సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. వాటని డిపోలో అప్పగించనున్నారు. ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా గొట్టిపాటి



ఈనాడు డిజిటల్, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'వ్యవసాయం, ఆక్వా రంగ సమస్యలపై దృష్టి పెడతాం. కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం' అని మంత్రి వివరించారు.

ఉపాధి నిధులతో ప్రగతి బాట

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. భీమవరం మండలం కొమరాడ గ్రామంలో మంగళవారం జరిగిన 'పల్లె పండగ' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ నిధులు రూ. 80 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు కలెక్టర్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో పలు సమస్యల్ని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, గృహనిర్మాణ సంస్థ డీఈ వెంకటరమణ, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాసరావు, సర్పంచి రాట్నాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



కొమరాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగరాణి, చిత్రంలో రామాంజనేయులు



రైతేరాజు
ఏడు పదుల వయసులో.. పండగలా వ్యవసాయం 6లో
ఆ సమయంలో పంటను కోయాలి

ఆకలి తీర్చే అక్షయపాత్ర


ఉత్పత్తుల్లో ఉమ్మడి జిల్లా అగ్రస్థానం

నేడు జాతీయ ఆహార దినోత్సవం

పాలకొల్లు, న్యూస్‌టుడే: వరి ఉత్పత్తుల్లో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగుతుండగా ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. కొబ్బరి, అరటి, మామిడి, ఆక్వా, కూరగాయలు తదితర ఆహార ఉత్పత్తుల్లోనూ మేటిగా నిలుస్తూ అన్నం గిన్నెగా ప్రసిద్ధమైంది.

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల ఎకరాలకు పైబడి వరి సాగవుతుండగా ఒక్క రబీలోనే 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. రాష్ట్రంలో ధాన్యం పండించే తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పోల్చిచూస్తే ఉమ్మడి జిల్లాదే మొదటి స్థానం. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు నిత్యం గూడ్సు రైళ్లలో ఎగుమతులు జరుగుతుంటాయి.

ఇతరత్రా ఉమ్మడి జిల్లాలో పండించే ఆయిల్‌పామ్ ఎగుమతులు బాగున్నాయి. 2 లక్షల ఎకరాల్లో వచ్చే ఉత్పత్తులతో ఏలూరు జిల్లా మొదటి స్థానంలో కొనసాగుతుంది. మామిడిలోనూ మనం ముందంజలోనే ఉన్నాం. నూజివీడు మామిడికి దేశవిదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఏటా వేసవి సీజన్‌లో 5 నుంచి 10 టన్నుల వరకు నూజివీడు మామిడి పండ్లను దుబాయ్, సింగపూర్, దక్షిణకొరియా, మాల్దీవులకు ఎగుమతులవుతుంటాయి. నిమ్మ, జీడిమామిడి ఉత్పత్తుల్లో మొదటి మూడు, నాలుగు స్థానాలు ఉమ్మడి జిల్లా కైవసం చేసుకుంది. అరటి, కూరగాయల సాగులోనూ మంచి ఉత్పత్తులతో జిల్లా ప్రగతి బాటలో పయనిస్తోంది.






ఉమ్మడి పశ్చిమ గోదావరిని అన్నపూర్ణగా అభివర్ణిస్తుంటారు. దేశంలోని మొత్తం వరి సాగులో 20 శాతం పశ్చిమలోని మార్టేరు వరి పరిశోధన కేంద్రం నుంచి వెళ్లిన విత్తనాలదే.

పండ్లు కూరగాయలు కలిపి ఉమ్మడి జిల్లాలో ఏటా 2.50 లక్షల టన్నుల దిగుబడి వస్తుంది.

ఆక్వా అదుర్స్ ఆక్వాసాగులోనూ అద్భుతమైన ఫలితాలతో ఉమ్మడి జిల్లా దూసుకుపోతోంది. మొత్తం రాష్ట్ర ఆదాయం రూ.50 వేల కోట్లలో ఉమ్మడి జిల్లా టర్నోవర్ రూ. 18 వేల కోట్లకు పైబడి ఉందంటే జిల్లా రొయ్య ఏ విధంగా మీసం మెలేస్తుందో తెలుసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా ఉత్పత్తులు ఎక్కువగా ఐరోపా దేశాలకు ఎగుమతవుతున్నాయి. ఎంతో విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని సైతం రాబడుతున్నాయి.

కమ్మని కొబ్బరి ఉమ్మడి జిల్లాలో పండించే కొబ్బరికి ఇతర రాష్ట్రాల్లో గిరాకీ ఉంది. మొత్తం మీద 56 వేల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి పంట రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉందంటే పంట ప్రత్యేకత తెలుస్తుంది. ఒక్క పశ్చిమలోనే 11.29 లక్షల కాయలు దిగుబడి వస్తుంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, నాగపూర్, రాజస్థాన్ ప్రాంతాలకు నిత్యం 50 లారీలకు పైగా ఎగుమతులవుతున్నాయి.



ఉమ్మడి జిల్లాలో (సాగు ఎకరాల్లో) ఇలా

వరి	ఆక్వా	కొబ్బరి	మామిడి	అరటి	నిమ్మ	ఆయిల్‌పాం	జీడిమామిడి
5.50 లక్షలు	2.80 లక్షలు	56 వేలు	50 వేలు	4,800	5,100	2.05 లక్షలు	14,500

చంద్రప్రభ వాహనంపై శ్రీహరి విహారం


వల్మీకంలో ద్వారకాధీశుడి దర్శనం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్వారకాధీశుడు.. శ్రీదేవి, భూదేవి సమేతంగా చంద్రప్రభ వాహనంపై విహరించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి.. హారతిచ్చి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు నీరాజనాలు పలికారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై జరగాల్సిన స్వామివారి గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది. రోజుకో విశేష అలంకారంలో భక్తులను కనువిందు చేస్తున్న స్వామివారు మంగళవారం వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో దర్శనమిచ్చారు.





చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం



వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో చిన వేంకన్న

- కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఏడు గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం. రాత్రి ఏడు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం. 8.30 గంటలకు వెండి శేషవాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.

కుటీర పరిశ్రమలతో అతివలకు ఊతం

కేంద్ర పథకాలతో రుణాలు

వీరవాసరం, న్యూస్‌టుడే: అతివలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా అడుగులు వేస్తోంది. స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకొనే వారికి కేంద్ర పథకాల ద్వారా వ్యక్తిగత రుణాలు అందించి ప్రోత్సహించాలని నిర్ణయించింది.

35 శాతం రాయితీ.. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ (పీఎంఎఫ్ఎంఈ), ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) పథకాల ద్వారా మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.5 లక్షల వరకు రుణం ఇస్తారు. దీనిలో 35 శాతం రాయితీ మినహాయించి మిగిలిన మొత్తాన్ని నెలవారీ వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఏదైనా యూనిట్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్న వారితో పాటు కొత్తగా కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆసక్తి ఉన్నవారికి ఇస్తారు.



వంట నూనెల వ్యాపారం చేస్తున్న మహిళ (పాత చిత్రం)

వర్తింపు వీటికే.. కారం, పసుపు, మసాలా పొడి, తేనె, తినుబండారాల ప్యాకింగ్, బేకరీ, మిఠాయి, ఐస్‌క్రీం దుకాణాలు, ఊరగాయలు, అప్పడాలు, భోజనం ప్లేట్ల తయారీ, డీజే సౌండ్ సిస్టం, డెయిరీ, పౌల్ట్రీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

అర్హుల గుర్తింపు.. చిరుతిళ్లు తయారు చేసే మహిళలకు రుణాలు మంజూరు చేయనున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాకు 150 యూనిట్లు కేటాయించారు. ఇప్పటికే 58 దరఖాస్తులు వచ్చాయి. అర్హులను గుర్తించే ప్రక్రియను డీఆర్‌డీఏ అధికారులు ప్రారంభించారు.

- ఆర్. దేవానందకుమార్, పీఎంఎఫ్ఎంఈ, జిల్లా నోడల్ అధికారి

కోట్లు పోశారు పైపైన వేశారు

☛ రోడ్లపై గోతులు మిగిల్చారు ☛ పట్టణదారుల్లో.. ప్రయాణం నరకం

పరిశీలన



తాడేపల్లిగూడెంలోని కడకట్ల నుంచి హౌసింగ్‌బోర్డు వెళ్లే దారితో పాటు కె.ఎన్ రోడ్డు అధ్వానంగా మారాయి. మరమ్మతుల పేరిట రూ. 10 లక్షలు బిల్లులు చూపారు. ఇప్పుడా దారిలో వెళ్లడం నరకంగా మారింది.



భీమవరం రెండో పట్టణంలోని శ్రీరామపురం ప్రధాన రహదారి ఇది. రూ.65 లక్షలతో తారు రోడ్డు వేశారు. రద్దీగా ఉండే ఈ దారిలో రోజూ ప్రమాదాలు చూడలేకపోతున్నామని స్థానికులు చెప్పారు. వాహనాలు అదుపుతప్పి గుంతల్లో పడి పలువురు గాయపడుతున్నారన్నారు.

న్యూస్‌టుడే, పురపాలక బృందం

పట్టణాల్లో రహదారులు ఛిద్రమయ్యాయి. సాధారణ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని రూ.కోట్లు వెచ్చించిన వైకాపా ఈ ఏడాది ఆరంభంలో హడావుడిగా వేయించిన రహదారి పనుల్లో నాణ్యత లేకుండా పోయింది.

వర్షాకాలం ముగియక ముందే వేతారు కరిగింది. గుంతలుగా ప్రారంభమై రహదారుల పొడవునా చిన్నపాటి తటాకాలుగా మారాయి. ముందు చూపు లేకుండా వెళ్తే ప్రమాదం తప్పడంలేదని వాహన చోదకులు వాపోతున్నారు. పట్టణాల్లో రహదారుల అభివృద్ధి పేరిట రూ.కోట్లు బిల్లులు చూపారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్రజలకు పాట్లు తప్పడంలేదు.

నాణ్యతా లోపం.. అయిదేళ్లకు ముందు తారుతో అభివృద్ధి చేసిన రహదారులు కొన్నేళ్లపాటు మరమ్మతులకు గురయ్యేవి కావు. ఎక్కడైనా గుంతలుంటే చతురస్రంగా తవ్వి అందులో తారు వేసి కంకరతో పటిష్ఠ పరిచేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక గాలేస్తే ఎగిరిపోయే రాళ్లను వేశారు. ఫలితంగా బిల్లులు చెల్లించేలోగా తారు కరిగిపోయింది. పట్టణాల్లో రహదారుల అభివృద్ధికి ఏటా రూ.3 కోట్లు నుంచి రూ.9 కోట్లు ఖర్చు చేసినా కొన్ని నెలలకు అదే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతులంటూ మళ్లీ రూ.లక్షలు మింగారు.



పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ నుంచి పెనుమదం వెళ్లే రహదారి గుంతలతో ఉంది. రూ.కోటితో అభివృద్ధి చేసిన జాడలు ఇప్పుడు లేవు. కేవలం గుంతలు పూడ్చేందుకు రూ. 10 లక్షలు అవుతాయని అధికారులు అంచనా వేశారు.

మరమ్మతులు చేయిస్తాం.. వర్షాలతో దెబ్బతిన్న రహదారులన్నింటినీ సాధారణ నిధులతో అభివృద్ధి చేయాలని సూచించా. గుంతలు ఉన్నచోట్ల తక్షణం మరమ్మతులు చేయాలని స్థానిక అధికారులకు చెప్పాం' అని పురపాలక ఆర్డీ నాగనరసింహారావు తెలిపారు.

పట్టభద్రుల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

కూటమి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కూటమి నాయకులంతా కృషిచేద్దామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం మంగళవారం రాజమహేంద్రవరంలో నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందు.. నమోదు ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

వైకాపా యువతను మోసం చేసింది.. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంతా కలిసి కట్టుగా పనిచేస్తే వైకాపా పోటీకి వచ్చే అవకాశం లేదన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. కాకినాడ, ఏలూరు, రాజమహేంద్రవరంలో ఎక్కువ మంది పట్టభద్ర ఓటర్లుంటారు కనుక మరింత దృష్టి సారించాల్సి ఉందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీలు హరిప్రసాద్, చిరంజీవరావు, మాజీ మంత్రులు సుజన కృష్ణ రంగారావు, జవహర్, పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, భాజపా జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్ తదితరులు మాట్లాడారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు

కాకినాడ కలెక్టరేట్: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారంతో గడువు ముగిసింది. జులై 29 నుంచి సెప్టెంబరు 3 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబరు 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అభ్యంతరాల స్వీకరణతో పాటు ఈనెల 15 వరకు మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇకపై కొత్తగా తీసుకోరు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులపై ఈనెల 30లోగా విచారణ చేసి, నవంబరు 6న తుది జాబితా ప్రకటిస్తారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు మంగళవారం రాత్రికి కూడా కాకినాడ కలెక్టరేట్‌కు చేరలేదు.

రీసర్వేకు సహకరించండి: జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇప్పటి వరకు 174 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించిన ఆర్‌వోఆర్ రికార్డులు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఇంకా రీసర్వే జరగాల్సిన 119 గ్రామాల్లో ఈ ప్రక్రియకు భూ యజమానులు సహకరించాలని కోరారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు 9.30కే హాజరవ్వాల్సిందే

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల వేదికకు అధికారుల గైర్హాజరుపై 'పేరు మారింది.. తీరు మారలేదు' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. జిల్లాలోని పెనుమంట్ర, యలమంచిలి తదితర మండలాల్లోని అన్ని శాఖల అధికారులకు దీనిపై సర్వపత్రం మంగళవారం విడుదల చేశారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమానికి ఉదయం 9:30 గంటలకే హాజరవ్వాలని దానిలో పేర్కొన్నారు.

- తణుకు పట్టణానికి చెందిన కుటుంబం మూడేళ్ల కిందట పీఎంఏవై ద్వారా అందిన సాయానికి మరో రూ.3 లక్షలు వెచ్చించి, ఇల్లు కట్టుకున్నారు. పరిశీలనలో భాగంగా ఇంటికి వెళ్లి పలు ప్రశ్నలు వేయడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. బతుకుదెరువుకు చిన్నపాటి వ్యాపారం చేస్తున్నామని, ఇప్పుడు ఆరా తీయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.


- నరసాపురంలో ఒక కుటుంబం రెండేళ్ల కిందట ఇల్లు కట్టుకున్నారు. విద్యుత్తు బిల్లు 300 యూనిట్లు దాటినా, నాలుగు చక్రాల వాహనం ఉన్నా సొమ్ములు తిరిగి చెల్లించమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కారు ఉందా.. కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందా?

సర్వేతో పీఎంఏవై లబ్ధిదారుల ఉలిక్కిపాటు

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ చేపట్టిన పునః పరిశీలన (రీవెరిఫికేషన్)తో ప్రధాన మంత్రి ఆవాస యోజన లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. మీ ఇంటికి విద్యుత్తు 300 యూనిట్లు దాటింది, పీఎంఏవై ద్వారా అందిన సాయం తిరిగి చెల్లించాలని సిబ్బంది సూచిస్తుండటంతో ఏం చేయాలో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనర్హులను గుర్తించడానికే.. పీఎంఏవైలో భాగంగా మంజూరు చేసిన రూ.1.80 లక్షల సాయాన్ని చెల్లించాలంటూ గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సంబంధిత లబ్ధిదారులకు ఫోన్లు చేస్తున్నారు. దీనిపై భీమవరం, తణుకు, ఆచంట, వీరవాసరం, పెనుమంట్ర, నరసాపురం తదితర ప్రాంతాల్లో కొంతమంది కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే గత ప్రభుత్వ హయాంలో అనర్హులను సైతం లబ్ధిదారులుగా చేర్చారనే ఫిర్యాదులు అందడంతోనే పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు.



- గత వైకాపా ప్రభుత్వం తప్పిదాలతో పీఎంఏవై సొమ్ములు లబ్ధిదారులకు పూర్తిగా అందలేదు. బయట వడ్డీలకు అప్పులు తెచ్చి నిర్మాణం పూర్తి చేశారు. కేంద్రం ఇచ్చిన సొమ్మును వైకాపా ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకున్నారు. అందులోనూ తమ అనుయాయులకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారనే ఆరోపణలున్నాయి.

లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరంచెల విధానాల్లో నాలుగు చక్రాల వాహనముంటే సంబంధిత అధికారి ధ్రువీకరణ పత్రం, దారిద్ర్యరేఖ దిగువన ఉంటే ఆదాయ, ఇతర సంబంధిత పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని హౌసింగ్ పీడీ పిచ్చయ్య తెలిపారు.

62,973	పీఎంఏవైలో నమోదైన ఇళ్లు
60,198	ఆరంచెల విధానంలో సర్వే చేసింది
2,705	చేయాల్సింది
22,757	సొంతంగా నిర్మించుకున్న వారు


సాగు తీరు పరిశీలించాం.. ఇక ఆచరిస్తాం

ఏలూరు జిల్లాలో గుజరాత్ బృందం పర్యటన

ఏలూరు గ్రామీణ, పెదవేగి- న్యూస్‌టుడే: గుజరాత్‌లోని వివిధ సంస్థల ప్రతినిధుల బృందం మంగళవారం జిల్లాలో పర్యటించింది. ఏలూరు గ్రామీణం, పెదవేగి మండలాల్లోని వెంకటాపురం, అమ్మపాలెం, లక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించింది. వెంకటాపురంలో రైతు సాధికార సంస్థ ప్రదర్శించిన సార్వత్రిక సూత్రాల వీలు, వరి కాంపాక్ట్ బ్లాక్‌ను తిలకించారు. ఏ గ్రేడ్ వరి పొలాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. సాగు ఆదాయ, వ్యయాలు తెలుసుకున్నారు. అమ్మపాలెంలో కొటారు రంగయ్య, లక్ష్మీపురంలో చక్రపాణి సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. వాటి ఉపయోగాలు, జీవ వైవిధ్యంపై ఆరా తీశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు ఆచరిస్తున్న రైతులను వారు అభినందించారు. ద్వారకాతిరుమల మండలం గుండుగొలను గుంటలోని గోపాలకృష్ణ ఎస్పీఎం దుకాణంలో కషాయాలు, జీవ ఉత్ప్రేరకాల తయారీలను పరిశీలించారు. జిల్లాలోని రైతుల అనుభవాలు, వారి సలహాలు, సూచనలు తెలుసుకోవడం ఆనందంగా ఉందని గుజరాత్ ప్రతినిధులు తెలిపారు. ఈ విధానాలను తమ రాష్ట్రంలోనూ ఆచరించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.



ఒకే చోట వివిధ రకాల పంటల సాగును పరిశీలిస్తున్న ప్రతినిధులు



మొక్క తొడిగిన మోడు

నరసాపురం గ్రామీణ మండలం చినమైనవానిలంకలోని తాటిచెట్టు మోడుపై రావిమొక్క మొలిచింది. సాధారణంగా బతికున్న చెట్ల బెరడుల్లో మొక్కలు మొలవడం తెలిసిందే. పూర్తిగా మోడువారి ఒరిగిపోయిన తాటిచెట్టు కాండంపై మొక్క పెరుగుతుండటంతో ఆ మార్గంలో వెళ్లేవారంతా ఆసక్తిగా చూస్తున్నారు.

- ఈనాడు, నరసాపురం

విద్యార్థులకు వీరగాథల పోటీలు

- దేశభక్తి అంశాలే ప్రాతిపదిక
- 17 నుంచి జిల్లా స్థాయి పోటీలు

కొయ్యలగూడెం గ్రామీణ, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే



ఝాన్సీ లక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశసేవ చేయమని చెబితే ఎలా స్పందిస్తారు?.. 1857 తిరుగుబాటులో పాల్గొన్న ఓ వీరుడు గురించి చెప్పమంటే ఎవరి గురించి చెబుతారు? స్వాతంత్ర్య పోరాటంలో నీకు స్ఫూర్తిని కలిగించిన దేశభక్తుడు గురించి వివరించమంటే.. విద్యార్థులు ఏం చెబుతారు ఇవన్నీ.. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తోన్న వీర్‌గాథ 4.0 పోటీల్లోని అంశాలు.

ప్రభుత్వం మూడేళ్లుగా ఆయా పోటీలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు సత్కారం, ప్రశంసాపత్రం, జాతీయ స్థాయి విజేతలకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేలు ఇస్తారు. ఈ పర్యాయం పాఠశాల స్థాయి పోటీలు మంగళవారంతో ముగిశాయి.

సీబీఎస్ఈ పాఠశాలలు మినహా..

సీబీఎస్ఈ పాఠశాలలు మినహా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అందరూ అర్హులే. 3-5 తరగతుల విభాగంలో పద్యం, 150 పదాలకు మించని కథ, చిత్రలేఖనం, 6-8 తరగతులకు 300 పదాల కథ, 9-10 తరగతులకు 700 పదాల వ్యాసరచన, 11-12 తరగతులకు వెయ్యి పదాల వ్యాస రచనతో పాటు, చివరి మూడు విభాగాలకు పద్యాలు, చిత్రలేఖనం, ఒకటి, రెండు నిమిషాల నిడివితో వీడియో(మల్టీమీడియా) ప్రదర్శన పోటీలు జరుగుతాయి. దేశభక్తితో కూడిన చరిత్ర ఆధారంగా పోటీల్లో పాల్గొనాల్సి ఉంది.

విద్యార్థుల వివరాలు

పాఠశాలలు	ఏలూరు	పశ్చిమగోదావరి
ప్రాథమిక	64748	54070
ప్రాథమికోన్నత	40548	30672
ఉన్నత	162145	148184

ఏయే స్థాయిల్లో ఎప్పుడెప్పుడంటే..

జిల్లా స్థాయిలో 17 నుంచి నవంబరు 10, రాష్ట్రస్థాయిలో నవంబరు 12 నుంచి 30, జాతీయ స్థాయిలో డిసెంబరు 4 నుంచి 24 తేదీల మధ్య పోటీలు ఉంటాయి.

ప్రస్థానం ఇలా..

ప్రతి పాఠశాలలోనూ నాలుగు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురిని వీర్‌గాథ 4.0 పోర్టల్లో నమోదు చేయాలి. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయికి అక్కడ విజేతలైన నలుగురిని రాష్ట్రస్థాయికి, ప్రతిభ చూపిన ఎనిమిది మందిని జాతీయ స్థాయికి పంపుతారు. అక్కడ ఒక్కో విభాగం నుంచి 25 మంది వంతున 100 మంది విజేతలను ఎంపిక చేస్తారు.

ప్రోత్సహించాలి

'అన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులను పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. దేశభక్తుల చరిత్రలు, స్ఫూర్తి ప్రదాతల కథలు తెలుసుకునేందుకు వీర్‌గాథ 4.0 పోటీలు చక్కని అవకాశం. విజేతల వివరాలను పోర్టల్‌లో పొందుపర్చాలి'అని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల విద్యాధికారులు ఎస్.అబ్రహం, నాగమణి సూచించారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కేంద్ర మహాసభ విమర్శించింది. భీమవరంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆ పార్టీ నాయకుడు గురుదాసు రఫాయేలు అధ్యక్షతన మహాసభ మంగళవారం నిర్వహించారు. తొలుత సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, ఆర్. సత్యనారాయణరాజు, పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు ఎం.ఆంజనేయులు గత మూడేళ్లకు సంబంధించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. మరో నాయకుడు కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పాలకులు ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు ధరలు తగ్గినా పెట్రోలు, డీజిల్ ధరలు యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. అనంతరం మహాసభ కార్యదర్శిగా ఎం.ఆంజనేయుల్ని తిరిగి ఎన్నుకున్నారు. నాయకులు రమేశ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పైవంతెన నిర్మాణానికి అడుగులు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరం వద్ద జాతీయ రహదారిపై పైవంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ వడివడిగా అడుగులు వేస్తోంది. పైవంతెన నిర్మాణంపై నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఇటీవల నేషనల్ హైవే అథారిటీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో భూసేకరణ పనులు ప్రారంభించారు. నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి మార్కింగ్ వేశారు.

కైకరంలోని కూరకారం రెస్టారెంట్ నుంచి బీసీ కాలనీ వరకు సుమారు 1.790 కిలోమీటరు పొడవున పైవంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.70 కోట్లు మంజూరు చేసింది. పై వంతెన నిర్మాణానికి 2022 సెప్టెంబరు 22న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజమహేంద్రవరం నుంచి భూమి పూజ చేశారు.



కైకరంలో పైవంతెన నిర్మించే ప్రాంతం

నిర్వాసితులు కోర్టును ఆశ్రయించటంతో

గతంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఆస్తులు పోగొట్టుకున్నామని, పైవంతెన నిర్మాణంతో రెండోసారి కూడా తమ భూములు ఇస్తే అన్ని విధాలా నష్టపోతామని నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే ఇచ్చింది. నేషనల్ హైవే అథారిటీ కౌంటర్ దాఖలు చేయడంతో ఇరువురి మధ్య కొన్నేళ్ల పాటు వాదనలు జరిగాయి. 3డీ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం 60 మీటర్ల మేర భూసేకరణ చేపట్టాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొందని హైవే అథారిటీ ప్రత్యేక ఉప తహసీల్దారు ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.

ఇక్కడే ఎందుకు?.. 216ఏ జాతీయ రహదారి మీదుగా భారీ వాహనాలు, లారీలు వాహనాలు వేగంగా ప్రయాణించడంతో తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పైవంతెన నిర్మించడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడదు.

కోల్పోయేవి ఇవే.. 2018లో వేసిన మార్కింగ్ చెరిగిపోవడం, భూయజమానులు మారడంతో రెవెన్యూ దస్త్రాల ప్రకారం మళ్లీ సర్వే చేసి మార్కింగ్ వేశారు. 61 సర్వే నంబర్లలోని సుమారు 21,395 చదరపు మీటర్ల భూమి అవసరం. ఎస్సీ బాలుర వసతి గృహం, జడ్పీ ఉన్నత పాఠశాల (కొంతభాగం), పలు దుకాణాలు, భవనాలు, పొలాలు పైవంతెన నిర్మాణంతో కనుమరుగు కానున్నాయి.

సగటు వర్షపాతం 17 మి.మీ.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు 17 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకొల్లు మండలంలో 50.4 మి.మీ. వర్షం కురిసింది. మండలాల వారీగా నరసాపురం 32.2, యలమంచిలి 26.4, తణుకు 23.4, పెనుగొండ 21.6, మొగల్తూరు 21.2, వీరవాసరం 20.2, పోడూరు 18.4, భీమవరం 17.4, పెనుమంత్ర 16.6, ఆచంట 16, ఉండి 12.8, ఇరగవరం 12.4 మి.మి. చొప్పున వర్షపాతం నమోదైంది.

అంబేడ్కర్ ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తి

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తి అని భాజపా పట్టణ అధ్యక్షుడు, రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కుమార్ అన్నారు. అంబేడ్కర్ క్షీరపురిని సందర్శించిన సందర్భాన్ని గుర్తు చేస్తూ స్థానిక రైల్వేస్టేషన్‌లో దిగిన చిత్రపటాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944లో అంబేడ్కర్ పాలకొల్లు రైల్వేస్టేషన్‌లో దిగి 80 సంవత్సరాలు పూర్తయిందన్నారు.



అంబేడ్కర్ రైల్వేస్టేషన్‌లో దిగిన చిత్రాన్ని ఆవిష్కరించిన కుమార్

రహదారి ప్రమాదంలో బాలుడి మృతి


పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం మోగల్లు వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో పదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఎస్సై ఎన్.హరిబాబు కథనం ప్రకారం. . అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన దిగుమర్తి జీవన్‌సద్విక్ (10) దసరా సెలవుల నేపథ్యంలో నాలుగు రోజుల కిందట భీమవరంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి తండ్రి రవితో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా మోగల్లులో క్రిస్టియన్ శ్మశానవాటిక సమీపాన వారిని వ్యాన్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమైన జీవన్‌ను విజయవాడలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనలో గాయపడిన బాలుడి తండ్రి రవి భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

నేడు విడుదల కానున్న షెడ్యూలు

నరసాపురం, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఆ దిశగా సమాయత్తమైంది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సాగునీటి సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో కాలువల నిర్వహణలో రైతులకు ప్రాతినిధ్యం, అధికార యంత్రాంగంలో జవాబుదారీ లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీటి సంఘాలకు పునరుజ్జీవనం తెచ్చే దిశగా చర్యలు చేపట్టింది. ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. ఎన్నికల నిర్వహణ షెడ్యూలు ఈ నెల 16న విడుదల చేయనున్నారు. వచ్చేనెల 24 లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తికానుందని అధికారులు చెబుతున్నారు. ఆయా సంఘాల పరిధిలో భూములకు సంబంధించి ఆర్ఎస్ నంబర్ల జాబితాలను జలవనరులశాఖ అధికారులు ఇప్పటికే రెవెన్యూ అధికారులకు అందజేశారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు పరిధిలో సర్వే నంబర్ల వారీగా క్షేత్రస్థాయిలో వీఆర్వోలు పరిశీలించి జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. జిల్లాలో 98 మైనర్, 13 మేజర్ నీటి సంఘాలు ఉన్నాయి. వీటికి ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు నిర్వహిస్తారని జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజినీరు దక్షిణామూర్తి తెలిపారు. ఆయా కాలువల ఆయకట్టుకు సంబంధించి సర్వే నంబర్ల జాబితాలను జలవనరుల శాఖాధికారులు అందజేశారని, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసి జాబితాలను రూపొందిస్తారని ఆర్డీవో దాసిరాజు తెలిపారు.

కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ



వీరవాసరం, న్యూస్‌టుడే: కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడిగా వీరవాసరం గ్రామానికి చెందిన గుండా రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ అధినేత, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య ఇటీవల ఉత్తర్వులు ఇచ్చినట్లు రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపు, బలిజ సంక్షేమ సేన మండల కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఏడు పదుల వయసులో.. పండగలా వ్యవసాయం

ఉంగుటూరు, న్యూస్‌టుడే

ఏడు పదుల వయసులో బొప్పాయిలో అంతర పంటల సాగు చేసి ఔరా అనిపిస్తున్నారు ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన యర్రా నరసింహారావు. సంప్రదాయానికి భిన్నంగా మారుతున్న కాలానికి అనుగుణంగా స్వల్ప నీటి వినియోగంతో సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. అయిదో తరగతి వరకు చదువుకున్న నరసింహారావు 1965 నుంచి వ్యవసాయం చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట సేంద్రియ వ్యవసాయ నిపుణుడు పాలేకర్ కాకినాడ, గుంటూరులో నిర్వహించిన శిక్షణ తరగతులకు వెళ్లారు. ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని చివరకు విజయం సాధించారు. పురుగులు, తెగుళ్ల నివారణకు సొంతంగానే కషాయాలు తయారు చేసుకుంటున్నారు. స్థానికంగా 20 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నారు. పశువుల ఎరువు, డ్రిప్, మల్చింగ్‌షీటు, దుక్కు, కౌలు మొత్తం కలిపి ఎకరానికి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అనంతపురం నుంచి తైవాన్ 786 రకం బొప్పాయి మొక్కలు సాగు చేస్తున్నారు. అందులో అంతర పంటలుగా దేశవాళీ రకాలైన బీర, వంగ, మిర్చి, దోస, బెండ, తోటకూర, గోంగూర, చుక్కకూర, బంతి వేశారు. ఇప్పటి వరకు 25 టన్నుల బొప్పాయి, అయిదు టన్నుల చొప్పున బీర, దోస, టన్ను చొప్పున బంతి, మిర్చి విక్రయించారు. పెట్టుబడి పోను ఎకరానికి రూ.50 వేల వరకు లాభం వచ్చింది.



రైతు సాగు చేస్తున్న బొప్పాయి తోట

రైతేరాజు

సొంతంగానే కషాయాలు

నరసింహారావు సొంతంగానే కషాయాలు తయారు చేసుకుంటున్నారు. పంటలను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణ, మొక్కల్లో బలం పెంచడంలో ఆయనకు బాగా పట్టు ఉంది. ఘన జీవామృతం, జీవామృతం, పంచగవ్య, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, దశపర్ణి కషాయం, పుల్లటి మజ్జిగ, ఆవు పాలు సొంటి స్వయంగా తయారు చేసుకుంటున్నారు. ఉత్తమ రైతు పురస్కారాలు కూడా అందుకున్నారు.

ప్రణాళికతోనే లాభాలు



అయిదు దశాబ్దాలు పైగా వ్యవసాయం చేస్తున్నా. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యమైన పంటలు పండిస్తున్నా. సొంతంగానే కషాయాలు తయారు చేసుకుంటున్నా. ప్రణాళికా బద్ధంగా సాగు చేస్తే లాభాలు వస్తాయి. మార్కెటింగ్ సదుపాయం ఉంటే మరింత ఆదాయం సమకూరుతుంది. - యర్రా నరసింహారావు, చేబ్రోలు

పండు ఈగల పని పడదాం

పోడూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తీగజాతి కూరగాయ పంటలైన బీర, ఆనప, పొట్ల, కాకర సాగు చేస్తున్నారు. ఈ పంటలకు కొన్ని సందర్భాల్లో పండు ఈగ సమస్యగా మారుతుంది. దీనికి సంబంధించి ఉద్యానశాఖాధికారి కె.ప్రియదర్శిని మాట్లాడుతూ సుమారు 15-30 శాతం మేర పంటకు నష్టాన్ని కలిగిస్తుంది. పండు ఈగ నివారణ, నియంత్రణ చర్యలను పూత మొదలు కాక ముందే మొదలు పెట్టాలి. తల్లి ఈగ కాయలపై లేత దశలో ఉన్నప్పుడు గుడ్లను పెడుతుంది. ఈ గుడ్లు 2 నుంచి 5 రోజుల్లో లార్వాలుగా మారి కాయలోనికి రంధ్రాలు చేసుకుని తినడం ప్రారంభిస్తాయి. ఈ దశలో లార్వా వలన కాయలపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కాయకుళ్లుకు దారితీస్తుంది. పండు ఈగ నియంత్రణకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 10 నుంచి 12 ఉంచటం వలన మగ ఈగలను నియంత్రించవచ్చు. దీనికి ఇథైల్ ఆల్కాహాల్ 60 మి.లీ., పి.ఎసిటోక్సిఫినైల్ బ్యూటానోన్ 40 మి.లీ., నూవాన్ (డైక్లోరివాస్) 20 మి.లీ కలిపి ఈ ద్రావణంలో 5×5×1.2 సెం.మీ చెక్కముక్క లేదంటే మందంగా ఉన్న 2 అంగుళాల కాటన్ తాడు తీసుకుని 24 గంటలు నానబెట్టాలి. లీటరు ఖాళీ ప్లాస్టిక్ సీసాను తీసుకుని దానికి మూడు వైపులా ఒక అంగుళం సైజు రంధ్రాలు చేయాలి. సీసా మూతకు చిన్న రంధ్రం చేసి తయారు చేసుకున్న ఎరను సీసా మధ్యలోకి వచ్చేలా నేలకు కనీసం 3-5 అడుగుల ఎత్తులో వేలాడదీయాలి.



పంటను ఆశించిన పండు ఈగ

మీరూ అడగొచ్చు

ప్రశ్న: మినుములో మరుక మచ్చల పురుగును ఎలా నివారించాలి ?

- కృష్ణమూర్తి, జంగారెడ్డిగూడెం

సమాధానం: పైరు పూత దశకు రాకముందు నుంచే అప్రమత్తంగా ఉండాలి. పూత దశలో (35 రోజులు) విధిగా పైరుపై 5 శాతం వేపగింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీని వల్ల గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పిల్ల పురుగులు కనిపించనట్లయితే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం
✆ చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ఆ సమయంలోనే పంట కోయాలి



కోత కోస్తున్న కూలీలు

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: 80 నుంచి 90 శాతం వెన్నులు పసుపు రంగులోకి మారుతున్నపుడు మాత్రమే వరి పంట కోత కోయాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ రైతులకు సూచించారు. వరి పంటను ఏ సమయంలో కోత కోయాలి, ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. గింజలో తేమ శాతం తగ్గించడానికి పనలను రెండు నుంచి మూడు రోజులు చేనుపైనే ఎండనివ్వాలి. ఎక్కువగా ఎండితే మిల్లింగులో కూడా నూక శాతం పెరుగుతుంది. నూర్చేటప్పుడు గింజల్లో 12 నుంచి 13 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. తూర్పారబెట్టడం ద్వారా నూర్చిన వరి నుంచి మట్టి, ఇతర వ్యర్థాలను వేరు చేయాలి. ఇందులో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దీనిని 12- 13 శాతం తగ్గించడానికి బాగా ఆరనివ్వాలి.

భీమవరం

● భీమవరం ● ఉండి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: యండగండిలో 33 కేవీ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

18న వేదశాస్త్ర పరిషత్తు మహాసభ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: వేదశాస్త్ర పరిషత్తు 72వ మహాసభను ఈ నెల 18న జువ్వలపాలెం రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు పరిషత్తు కార్యదర్శి జేవీవీ రామకృష్ణ మంగళవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు చతుర్వేద పండిత సమావేశం, వేద సభ, పలువురు పండితులకు సత్కారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

గునుపూడి, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే జీవుల మనుగడ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. భీమవరంలోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయంలో శ్రీవిజ్ఞాన వేదిక, తపాలా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. వేదిక కన్వీనర్ సీహెచ్‌రంగసాయి, పీఆర్‌వో సత్యనారాయణ, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అమ్మవారికి స్వర్ణ హారం సమర్పణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మెంటేవారితోటలో కొలువైన బాలా త్రిపుర సుందరి అమ్మవారికి పట్టణానికి చెందిన చవాకుల హేమ చంద్రమూర్తి దంపతులు, శివరామకృష్ణ దంపతులు 2 కాసుల స్వర్ణ హారం సమర్పించారు.



మంగళవారం ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించి హారాన్ని అలంకరించినట్లు అర్చకుడు శ్రీనివాస్ తెలిపారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

ఉండి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన ప్రతిపాదనలు అందజేయాలని నరేగా సాంకేతిక సహాయకుడు ఒమేగొరాజు సూచించారు. కలిగొట్ల, ఆరేడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. రెండు గ్రామాల్లో పంట బోదెలు, మైనర్ డ్రెయిన్ల ప్రక్షాళన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

అభ్యసన సమస్యలపై అవగాహన

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని మాదివాడ ప్రాంతంలో ఉన్న భవిత కేంద్రంలో అభ్యసన లోపాలపై ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలకు చదవడం, రాయడం నేర్పే విధానాలను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

బ్యాంకు ఖాతాతో ప్రమాద బీమా

దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడప బీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. బ్యాంకులో శూన్య నిల్వ ఖాతా తెరిస్తే రూ.6 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం లభిస్తుందని అధికారులు తెలిపారు. విద్యార్థులకు 28 సంవత్సరాలు వచ్చే వరకు ఎలాంటి అదనపు రుసుములు లేకుండా సేవలు అందుతాయని పేర్కొన్నారు.

ఛిద్రమై.. ప్రయాణం భారమై!

ఎక్కడ చూసినా అధ్వాన రహదారులే..

● ఆకివీడు మండల పరిధిలో పెదకాపవరం- క్రొవ్విడి రహదారి ఇటీవల వర్షాలకు ఇలా ఛిద్రం కావడంతో వాహన చోదకులు నరకం అనుభవిస్తున్నారు. ఈ మార్గంతో పాటు పెదకాపవరం- పాములపర్రు రహదారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.48 కోట్లు మంజూరయ్యాయి. రూ.15 కోట్ల మేర బిల్లులను గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.





● భీమవరం పట్టణంలో ఎఫ్‌సీఐ గోదాముల రోడ్డు పూర్తిగా శిథిలమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి చెరువుల్లా ఉన్న గుంతల్లో వాహనాల చక్రాలు మునిగిపోతున్నాయి.

ఆకివీడు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం, ఆకివీడు పట్టణాలతో పాటు రెండు నియోజకవర్గాల పరిధిలో పలు గ్రామాలు, అనేక నివాసిత ప్రాంతాలను అనుసంధానం చేసే రహదారులు పూర్తిగా ఛిద్రమై రూపు కోల్పోయాయి. పలు ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడి రహదారులు కుంగుపోతున్నాయి.

బిల్లులు చెల్లించక..

వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. కొన్ని మార్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినా సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు పనులను అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఇలాంటి రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు స్పందిస్తూ కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు చేయించామని, వర్షాలు తగ్గాక మిగిలిన ప్రాంతాల్లో పనులు చేపట్టేలా కృషి చేస్తామన్నారు.



ఇతర మార్గాలపై ప్రభావం

ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో వాహనదారులు గ్రామాల మీదుగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో చిన్న రహదారుల్లో రద్దీ పెరుగుతోంది. అసలే అంతంత మాత్రం ఉన్న ఈ రోడ్లు భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

బురద కయ్యలా చినకాపవరం- రామయ్యగూడెం రహదారి

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

ఉండి, న్యూస్‌టుడే

సమస్య: మహదేవపట్నం- చిలుకూరు ఆర్‌అండ్‌బీ రహదారి పలు చోట్ల గుంతలతో అధ్వానంగా మారింది. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- సుజాత, మహదేవపట్నం**

సమాధానం: రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపట్టనున్నాం. **- శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ**

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: రాయలం- కొమరాడ మార్గంలో ఉన్న మలుపు వద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. **- సూరిబాబు, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి గుంతను పూడ్చించేలా చర్యలు తీసుకుంటాం. **- రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ**

పాలకోడేరు, న్యూస్‌టుడే

సమస్య: గొల్లలకోడేరు వంతెన దిగువన ఉన్న కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారిపై వాననీరు నిలిచిపోతోంది. దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- సత్యనారాయణమూర్తి, గొల్లలకోడేరు**

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **- నాగేంద్రకుమార్, గ్రామ కార్యదర్శి**

వసతి గృహాల పరిశీలన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భీమవరం, కాళ్ల, ఉండి, ఆకివీడు ప్రాంతాల్లోని ప్రభుత్వ వసతి గృహాల్లో న్యాయమూర్తులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి శ్రీవేంకటేశ్వర బధిరోన్నత పాఠశాల ఆవరణలో వసతి గృహాన్ని, కాళ్ల మండలం పెదఅమిరంలోని అరుణోదయ మనో వికాస కేంద్రాన్ని, బుధవారం మార్కెట్‌కూడలి, పోలీసు బొమ్మకూడలిలో బీసీ బాలుర వసతి గృహాలను పరిశీలించారు. భీమవరం రెండో అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ డి.ధనరాజు ఆకివీడులో బీసీ బాలికల, ఎస్సీ బాలుర, ఉండిలో బీసీ బాలుర వసతి, ఎస్సీ బాలికల వసతి గృహాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాలు గురించి, అవసరమైన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు, వంట శాలలు, పరిసరాలు పరిశీలించారు.



సదుపాయాలపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి ధనరాజు

వినియోగదారుల హక్కులపై నిర్లక్ష్యం

ఆకివీడు, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖలో వినియోగదారుల వ్యవహారాల విభాగాన్ని అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారని జిల్లా వినియోగదారుల సంఘాల అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య విమర్శించారు. తన నివాసంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వినియోగదారుల రక్షణ మండలిని ఏర్పాటు చేసి రెండేళ్లు గడిచినా ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. నకిలీల బెడద పెరిగిపోతోందని, బిల్లులు లేకుండా బంగారం, ఇతర వస్తువులు విక్రయిస్తూ వ్యాపారులు పన్నులు ఎగవేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, తనిఖీలు మొక్కుబడిగా మారాయని ఆరోపించారు. అధికారులు స్పందించి జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న బంగారయ్య

తొలగిన మురుగు

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: చినఅమిరంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో మురుగు, వాననీరు రోడ్డుపైకి చేరుతున్న తీరుపై 'అటు వాననీరు... ఇటు మురుగు' శీర్షికతో 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో కార్మికులు ఆ ప్రాంతంలో డ్రెయిన్‌ను శుభ్రం చేశారు. భీమవరం-ఏలూరుపాడు ప్రధాన రహదారి వెంబడి నిలిచిన వాననీటిని మళ్లించేలా బాటలు ఏర్పాటు చేశారు. వర్షాలు తగ్గాక డ్రెయిన్‌లో పూడిక తీయిస్తామని కార్యదర్శి వెల్లడించారు.



ఈనాడు కథనానికి స్పందన

కానరాని స్వచ్ఛత

శృంగవృక్షం (పాలకోడేరు), న్యూస్‌టుడే: పల్లెలను చెత్త సమస్య పట్టిపీడిస్తోంది. పాలకోడేరు మండలంలో ఒక్క గ్రామంలో కూడా పూర్తిస్థాయి డంపింగ్ యార్డు లేకపోవడంతో సేకరించిన చెత్త, వ్యర్థాలను రహదారుల పక్కన వేయాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను పాలకులు, అధికారులు పూర్తిగా విస్మరించడంతో పలు గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. శృంగవృక్షం, వేంద్ర, మోగల్లు, పాలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. శృంగవృక్షంలో డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలంటూ స్థానికులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గ్రామ శివారులో స్థలం కేటాయించినా అక్కడికి వాహనాలు వెళ్లేందుకు సరైన దారి లేదు. డంపింగ్ యార్డుల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఈవోపీఆర్డీ రామప్రసాద్ తెలిపారు.



వేంద్రలో రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

మత్స్యపురిలో నేడు 'పల్లె పండుగ'

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వీరవాసరం మండలం మత్స్యపురిలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఆధునిక సేద్యంతో లాభాలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: రైతులు ఆధునిక సాగు పద్ధతులను పాటిస్తే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. గునుపూడి ప్రాంతంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉండి,న్యూస్‌టుడే: ఉండి మండలం కోలమూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఓ చెరువు గట్టుపై విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందారు. మిత్రుడితో కలిసి చెరువు వద్దకు వెళ్లిన ఆ యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలను తాకడంతో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఉండి పోలీసులు తెలిపారు.

ఇద్దరి అరెస్టు

కాళ్ల(భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: కాళ్ల మండలం బొండాడలో కోడి పందేలు వేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు మంగళవారం చెప్పారు. వారి నుంచి రూ.1200, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముందస్తు రక్షణ చర్యలు

నరసాపురం, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టామని ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఆయన మంగళవారం నరసాపురం గ్రామీణ మండలంలోని సముద్రతీర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అల్పపీడనంపై ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోలు రూములు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సేవలు అవసరమైన ప్రజలు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోలు రూము నంబర్ 93911 85874కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

వీడని మురుగు.. వెలగని దీపాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో నిర్మించిన రైల్వే దిగువ వంతెన(ఆర్‌యూబీ)ల్లో తొలి నుంచి మురుగు ఇబ్బందులు వెంటాడుతున్నాయి. వీటిలో ఏడాది పొడవునా మురుగు, సిల్టు పేరుకుపోయి వాహన చక్రాలు జారిపోతున్నాయి. విద్యుత్తు దీపాలు లేకపోవడంతో పగటి పూట కూడా అంధకారం నెలకొంటుంది. ఆర్‌యూబీల్లో సమస్యలపై ఇటీవల 'ఈనాడు' నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

✦ భీమవరం -తాడేపల్లిగూడెం మార్గంలో ఉన్న ఆర్‌యూబీలో కాలిబాటపై రాళ్లు అమర్చలేదు. ✦ మెంటేవారితోట, బుధవారం మార్కెట్ కూడలి నుంచి మెంటేవారితోటకు వెళ్లే దిగువ వంతెనల్లో సిల్టు పేరుకుపోయింది. ✦ వివేకానంద విగ్రహం వద్ద రైల్వేగేటు ప్రాంతంలో, సోమేశ్వరాలయం నుంచి ఎఫ్‌సీఐ గోదాములకు వెళ్లేదారిలో ఉన్న ఆర్‌యూబీల్లో దీపాల వెలుగులు లేవు. ✦ వీటిలో మురుగును ఎప్పటికప్పుడు తోడించేలా సెన్సార్ల ఆధారిత మోటార్లు అమర్చాల్సి ఉంది. గతంలో అమర్చిన మోటార్లు అపహరణకు గురికాగా కొత్తవి బిగించలేదు. ✦ ఆర్‌యూబీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను వెంటనే చేపడతామని పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి చెప్పారు.



గునుపూడి ప్రాంతంలో రైల్వే దిగువ వంతెన దుస్థితి

సాయిదుర్గా తేజ్ పుట్టినరోజు వేడుక

గునుపూడి, న్యూస్‌టుడే: సినీ కథానాయకుడు సాయిదుర్గా తేజ్ పుట్టినరోజు వేడుకను భీమవరంలోని ఉండపల్లి కాంప్లెక్స్‌లో మెగా అభిమానులు మంగళవారం నిర్వహించారు. అభిమాన సంఘం అధ్యక్షుడు చల్లా రాము కేకు కోసి మాట్లాడారు. అభిమానులు కోటి, బాబీ, శేషు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న మెగా అభిమానులు

చెల్లుబాటులో రూ.10 నాణేలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రూ.10 నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని.. వీటి వినియోగంపై అపోహలు అవసరం లేదని యూనియన్ బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు భీమవరంలోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు రూ.10 నాణేలు అందజేశారు. బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ, ఎల్‌డీఎం నాగేంద్రప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.



నాణేలు అందిస్తున్న బ్యాంకు అధికారులు

స్ఫూర్తిప్రదాత కలాం

వీరవాసరం, భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఏపీజే అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కలాం జయంతిని వీరవాసరం ఎస్ఎంబీటీవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ వి.నరసింహారావు, అధ్యాపకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమవరంలోని బీవీరాజు పార్కులో అరసవల్లి ట్రస్టు ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం, బీవీరాజు జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడ బైట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కలాం జయంతి, జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ కొప్పర్తి సురేశ్, డీన్ కురెళ్ల భాస్కరరావు, ఏబీఎస్ఆర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం: చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

బీవీ రాజుకు నివాళి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, బీవీ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీవీ రాజు 104వ జయంతిని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఆయన సమాధి వద్ద అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం 18 మంది పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కుముదవల్లి గ్రామంలో పేదలకు, శృంగవృక్షంలోని ఎఫ్ఎంఎల్ఆర్ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సెయింట్ మేరీస్ లెప్రసీ కేంద్రానికి రూ.60 వేలు విలువైన ఔషధాలు, బియ్యం ఇచ్చారు. 106 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అధ్యాపకులు, వాలంటీర్లు

పేరు మార్పు

కపురు హరిబాబు S/o. ఫకీరు, D.No. 7-37 కపురు వారి వీధి, రామాలయం దగ్గర, రాయకుదురు, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా, A.P. అనువేను నా పేరును కౌరు హరిబాబు నుండి కపురు హరిబాబుగా మార్చుకున్నాను. (అన్ని ప్రయోజనాల కోసం)

బుజ్జాయిలకు గుర్తుండిపోయేలా..!

చిత్రాలతో పాఠాలు నేర్పుతున్న డిగ్రీ విద్యార్థినులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలను సాధారణ పద్ధతిలో బోధించడం కంటే బొమ్మలు, చిత్రాలతో వివరిస్తే చిన్నారులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారనేది నిపుణుల మాట. ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు భీమవరంలోని బీవీరాజు విద్యాసంస్థలకు చెందిన డిగ్రీ విద్యార్థినులు. ప్రాథమిక తరగతులకు సంబంధించి విజ్ఞాన శాస్త్రం, గణితం తదితర పాఠ్యాంశాలపై వీరు బొమ్మలు తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వివరిస్తున్నారు.



చైతన్యం పెంచేలా

పర్యావరణ పరిరక్షణపై చైతన్యం నింపేలా నమూనాలు రూపొందించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. చెట్లు లేకపోతే కలిగే అనర్థాలను బొమ్మల రూపంలో వివరిస్తున్నాం. ఊపిరితిత్తులు, ఆహార సంబంధిత వ్యాధులకు కారణాలను తెలిపేలా వైద్యుల సూచనలతో నమూనాలు తయారు చేశాం. **- ఊహ, పూజిత బృందం**



ఆసక్తికరంగా..

బొమ్మల ఆధారంగా పాఠ్యాంశాలను వివరిస్తున్నప్పుడు చిన్నారులు ఆసక్తికరంగా వింటున్నారు. క్లిష్టమైన అంశాలను సైతం అర్థం చేసుకోగలుగుతున్నారు. ఈ విధానం ద్వారా బట్టీ విధానాన్ని దూరం చేయవచ్చు. మా బృందం కన్ను భాగాలపై చిత్రాలు రూపొందించాం. ఇంట్లో దొరికే వస్తువులతో వీటిని తయారు చేశాం. **- ప్రవల్లిక, కుసుమ బృందం**

ఖర్చు లేకుండా

థర్మాకోల్, కాగితాలు, అట్టముక్కలతో శరీరంలో భాగాలు, వాటి పనితీరు వివరించేలా బొమ్మలు తయారు చేశాం. ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించడమే మా లక్ష్యం. **- శ్రీజ, చరిష్మ బృందం**



కాలుష్య నివారణపై

జల వనరులు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నమూనాలు రూపొందించాం. తాగునీరు కలుషితమైతే తలెత్తే అనారోగ్య సమస్యలు, శరీరంలో ఏ భాగాలపై ప్రభావం పడుతుందో వివరిస్తున్నాం. **- అనూష, శ్రీమౌళిక బృందం**



భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	జిగ్రా
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	మా నాన్న సూపర్ హీరో

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు


డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని పురపాలక కమిషనర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలు ప్రాంతాల్లో నీరు నిలబడకుండా చూడాలన్నారు. డ్రెయిన్లలో మురుగు ప్రవాహానికి ఆటంకంగా ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. ఆయన వెంట పారిశుద్ధ్య అధికారి చంటిబాబు, జయరాజు, లావణ్య పాల్గొన్నారు.

రీసర్వే గ్రామ సభలు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలంలోని 12 గ్రామాలకు, కేవలం 3 గ్రామాల్లోనే వ్యవసాయ భూముల రీసర్వే పూర్తయింది. పెనుమంచిలి, కొడమంచిలి, కరుగోరుమిల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రీసర్వే సమస్యలపై గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈనెల 18న పెనుమంచిలిలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆచంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 20 గ్రామాలు ఉండగా ఆచంట మండలంలో మూడు గ్రామాలతో పాటు పోడూరు మండలంలో రావిపాడు, మినిమించిలిపాడు, పెనుగొండ మండలంలో ములపర్రు గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తయింది. ఆయా గ్రామాల్లో రైతులకు రీసర్వే తర్వాత తాజా పరిస్థితులపై అవగాహన కల్పించడానికి రెవెన్యూ, వ్యవసాయ అధికారుల కార్యాచరణతో ఈ సభలు నిర్వహిస్తున్నారు.



గొంతెనమ్మ గ్రామోత్సవం

నరసాపురం, న్యూస్‌టుడే: పేరుపాలెంనార్తు ఐజికీవారిపాలెంలో గొంతెనమ్మ జాతర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ప్రత్యేక వాహనంలో గొంతెనమ్మను గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగలో శ్రీఉమా వాసుకీ రవిసోమేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ శివారు పెద్దింట్లమ్మ ఆలయంలో మంగళవారం దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించారు. నాలుగు నెలల 15 రోజులకు రూ.3,97,508 వచ్చినట్లు ఆలయ ఈవో డి.పుష్పలాను తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖకు డివిజన్ అధికారి జీవీవీ ప్రసాద్, వడలి, ఆత్రేయ ఆలయ ఈవోలు మన్నే శ్రీనివాస్, జె.శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.


దస్త్రాలను పరిశీలిస్తున్న విశ్వేశ్వర ప్రసాద్

ఆన్‌లైన్ యాప్‌లతోపాటు దస్త్రాలు భద్రపరచాలి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ యాప్‌లతోపాటు దస్త్రాల్లో కూడా భద్రపరచాలని గణాంకాధికారి విశ్వేశ్వరప్రసాద్ అన్నారు. మండలంలోని అరట్లకట్ట సచివాలయం వద్ద నేషనల్ హెల్త్ టాస్క్ ఫోర్స్ టీం ఆరోగ్య కార్యక్రమాలు వైద్యుడు అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, గర్భిణులకు రక్త పరీక్షలు చేసి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.

స్కాన్ చేస్తే.. విద్యార్థి సమాచారం..!

12 అంకెలతో డిజిటల్ కార్డుల జారీకి సన్నాహాలు

పెనుగొండ, పాలకొల్లు గ్రామీణ, మార్టేరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకొస్తోంది. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్ర విద్యాశాఖ 12 అంకెలతో (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) అపార్ కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ మేరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ వారి నుంచి అనుమతి పత్రాలు తీసుకున్నారు.

తొలి దశలో.. తొలి దశలో 9, 10 తరగతుల వారికి ఈ కార్డులు అందించనున్నారు. తర్వాత కేజీ నుంచి పీజీ వరకు జారీకి కసరత్తు చేస్తున్నారు. వీరి తర్వాత మిగిలిన తరగతుల వారి వివరాలు నమోదు చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కార్డులు అందించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలకు విద్యాశాఖ సూచించారు.


చెరుకువాడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు


హెచ్‌ఎంకు అనుమతి పత్రం అందజేస్తున్న విద్యార్థి

కార్డుల్లో ఉండే వివరాలు..

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్‌కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకడమిక్ సమాచారంతో పాటు విద్యార్థి సాధించిన ఫలితాలు, ఇతర విద్యా పరమైన సమాచారం ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ నంబరు లేదంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సదరు విద్యార్థి సమస్త సమాచారం ప్రత్యక్షమవుతుంది. పైగా విద్యార్థి బ్యాంకు ఖాతా డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది.

మండలం	ఉన్నత పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	9,10 తరగతులు
ఆచంట	8	495	464
పెనుమంట్ర	7	478	379
పెనుగొండ	7	500	447
పోడూరు	8	528	512
పాలకొల్లు	7	550	712

ఈ కార్డుతో ఉపయోగాలు

విద్యార్థులు వివిధ కారణాలతో పలు పాఠశాలలు మారుతూ ఉంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని బోర్డుల్లో ఏకీకృత వ్యవస్థగా పని చేస్తుంది. ఒక విద్యాసంస్థ నుంచి మరో పాఠశాలకు మారిన సమయంలో ఏవిధమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుంది.

- పెండ్యాల భరణికుమార్, హెచ్‌ఎం, చెరుకువాడ హైస్కూల్

నమోదు చేస్తున్నాం..

అపార్ కార్డులకు సంబంధించి విద్యార్థుల వివరాలు యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. వీటిని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్ నుంచి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- డి.శుభాకరరావు, ఎంఈవో, పెనుగొండ

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట: 91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:
సమస్య: స్థానిక యనుకొండవారి తోట నుంచి వరిధాన వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది.
- రమేష్, స్థానికుడు.
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- రాజకుమార్, పురపాలక డీఈ

పెనుగొండ, న్యూస్‌టుడే:
సమస్య: పెనుగొండ-దేవ మార్గంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం.
- గుర్రాల సత్యనారాయణ, పెనుగొండ
సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తీయిస్తాం.
- టి.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి, పెనుగొండ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:
సమస్య: గ్రామ సచివాలయం-1 సమీపంలోని మినీ లేసు అల్లికల భవనం వద్ద కచ్చా డ్రెయిన్ పూడిపోయింది. దీంతో మురుగు ముందుకు సాగక దుర్గంధం వెదజల్లుతోంది.
- ఎన్.సత్యనారాయణ మూర్తి, కొప్పర్రు.
సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా గ్రామ కార్యదర్శికి సూచిస్తా.
- కె.నాగేంద్రకుమార్, ఈవోపీఆర్డీ, నరసాపురం.


క్షేత్ర సందర్శనలో రైతులు, అధికారులు

నచ్చిన మిల్లులో ధాన్యం అమ్ముకోవచ్చు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గతంలో మాదిరిగా కాకుండా ఇక నుంచి నచ్చిన మిల్లుకు రైతులు ధాన్యం అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని ఏవో ఎ.జ్యోషిలా తెలిపారు. మండలంలోని వెలగలవారిపాలెం, మల్లిపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల రీత్యా పంటను ఎండాకు, పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. పశువైద్యాధికారి జి.వరలక్ష్మి రైతులకు సూచనలు చేశారు.

యలమంచిలి, న్యూస్‌టుడే: వరి సాగులో ఆధునికతను అనుసరించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలోని చించినాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక రైతులకు మండల వ్యవసాయాధికారి సీహెచ్.దేవి సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం మంజూరుకు కృషి


రహదారి నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరించిన నాయకర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లి రెవెన్యూ గ్రామాల ప్రజలకు శుద్ధి జలాలు అందించేందుకు సమగ్ర రక్షిత మంచి నీటి పథకం మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా వారతిప్పలో ఉపాధి నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న రహదారికి ఆయన భూమి పూజ చేశారు. మోడిలో రూ.10 లక్షలతో నిర్మించిన రహదారిని సర్పంచి మారెళ్ల మాధవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయా పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జనసేన మండలశాఖ అధ్యక్షుడు కొల్లాటి గోపి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో నాయకర్ మాట్లాడారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : పితాని

పెనుగొండ, గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పల్లె పండగ గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సిద్ధాంతం గ్రామంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వడలి ఇందిరమ్మ కాలనీలో రూ.55 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.


సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సత్యనారాయణ

ధరల పెరుగుదలను అరికట్టాలి

పెనుగొండ, న్యూస్‌టుడే: ధరల పెరుగుదలను అరికట్టాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేసి, అనంతరం తహసీల్దార్ జి.అనితాకుమారికి వినతిపత్రం అందించారు. సీపీఎం పెనుగొండ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ రెండు నెలలు నుంచి నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగడంతో పేదలకు భారంగా మారాయన్నారు. చౌక డిపోల ద్వారా బియ్యం అందిస్తున్నారని కందిపప్పు, చింతపండు, పంచదార ఊసే లేదని వివరించారు.

18న వేదశాస్త్ర పరిషత్తు మహాసభ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: వేదశాస్త్ర పరిషత్తు 72వ మహాసభను ఈ నెల 18న జువ్వలపాలెం రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు పరిషత్తు కార్యదర్శి జేవీవీ రామకృష్ణ మంగళవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు చతుర్వేద పండిత సమావేశం, వేద సభ, పలువురు పండితులకు సత్కారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముందుకు సాగని నీరు



నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం సౌత్ నుంచి మొగల్తూరు మండలం రామన్నపాలెం వెళ్లే పంట కాలువ ఆరంభంలోని మినీ లాకు వద్ద తూడు, డెక్క, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలోని ఆయకట్టు భూములకు సాగునీరందించే రామన్నపాలెంలోకి సాగునీరు ముందుకు సాగక రామన్నపాలెం, ఎల్బీచర్ల, చామకూరిపాలెం, జెట్టిపాలెం, పసలదీవి తదితర గ్రామాలకు చెందిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మినీ డ్యామ్ వద్ద సాగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూడు, డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై జలవనరులశాఖ ఏఈఈ బి.మోహనకృష్ణ మాట్లాడుతూ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూడు, డెక్కను తొలగించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

దడ పుట్టిస్తున్న.. దారులు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే సిద్ధాంతం - పెనుగొండ ప్రధాన రహదారి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. సుమారు 8 కి.మీ. ఉండే ఈ మార్గంలో రామన్నపాలెం, వడలి, మల్లపదిబ్బ, పెనుగొండ గ్రామాలు ఉన్నాయి. గోతులతో అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలకు విద్యార్థులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఈ పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ రహదారుల దుస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే మరమ్మతులు చేపడతామని చెప్పారు.


సిద్ధాంతం-పెనుగొండ ప్రధాన మార్గంలో ఇలా..


గోతులతో వడలి- రామన్నపాలెం రహదారి

పాత కాలనీలకు మంచి రోజులు

ఆచంట, న్యూస్‌టుడే: జగనన్న కాలనీలంటూ హడావుడి చేసిన వైకాపా ప్రభుత్వం, వాటిలో కనీస వసతులు కల్పించకపోగా, పాత కాలనీలను పట్టించుకోకుండా వదిలేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పాత కాలనీలపై దృష్టి పెట్టింది. మండలంలోని ఆచంట, వేమవరం గ్రామాల్లోని ఇందిరమ్మ, ఎన్టీఆర్ కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నిధులు కేటాయించి, తాజాగా శంకుస్థాపనలు కూడా చేశారు. ఆచంట పరిధిలోని పోర గ్రామ పరిధిలో రెండు విభాగాలుగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలు చేపట్టనున్నారు. స్థానిక నటరాజ్ థియేటర్ వెనుక కాలనీలో రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ.41 లక్షలు కేటాయించి, శంకుస్థాపన చేశారు. ఆచంట వేమవరం గ్రామంలో పాత కాలనీల్లో ఒక రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి రూ.25 లక్షలు, మరో రోడ్డు, డ్రెయిన్‌కు రూ.20 లక్షలు కేటాయించారు. మండలంలోని ఇతర పాత కాలనీల్లో సమస్యలపై పీఆర్ ఏఈ ఏడుకొండలను 'న్యూస్‌టుడే' సంప్రదించగా గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తామని తెలిపారు.



అవి ఇవి అన్నీ

ఆచంటకు కొత్త అధికారి.. ఆచంట, న్యూస్‌టుడే: ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా టి.వెంకట్రావు విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన నాగేశ్వరరావు ఏలూరు బదిలీపై వెళ్లారు. ఆచంట పరిసర ప్రాంతాల్లోని విద్యుత్తు సమస్యలపై దృష్టిపెడతానని వెంకట్రావు తెలిపారు.

మద్యం దుకాణం తొలగించాలి.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్రలో గ్రంథాలయం, తహసీల్దార్ కార్యాలయం చెంత నడుస్తున్న మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతుల ధర్నా .. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ టి.రాజరాజేశ్వరీకి వినతి పత్రం అందజేశారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం పదిలం.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం పదిలమని ప్రధానోపాధ్యాయుడు ఆర్.భవానీప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా స్థానిక జీవీఎస్‌వీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అధికారులంతా హాజరు కావాల్సిందే.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాల్సిందేనని ఎంపీడీవో శర్మ తెలిపారు. అత్యంత ప్రాధాన్యతతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉదయం 9.30కు విధిగా హాజరు కావాలని సూచించారు.

అబ్దుల్ కలాంకు నివాళి..

పాలకొల్లు, న్యూస్‌టుడే: అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా స్థానిక అబ్దుల్‌కలాం పార్కులో కూటమి నాయకులు వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి సమన్వయ కమిటీ సభ్యుడు మహ్మద్‌జానీ, మాజీకౌన్సిలర్ షేక్‌బాజీ, షేక్ సిలార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు జీవీ, పెళ్చేటి బాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



అనుమానితులపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న భవనం వద్ద విద్యుత్తు తీగలు ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరు అనుమానితులపై మంగళవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం మేరకు పట్టణానికి చెందిన అడబాల సుబ్రహ్మణ్యం కుమారులు ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి వినియోగిస్తున్న విద్యుత్తు తీగలను ఇటీవల ధ్వంసం చేశారు. ఆ ఇంటి సమీపంలోని తండ్రి, కుమారులు విద్యుత్తు తీగలను ధ్వంసం చేసి ఉంటారని సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ముందస్తు రక్షణ చర్యలు

నరసాపురం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టామని ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఆయన మంగళవారం నరసాపురం గ్రామీణ మండలంలోని సముద్రతీర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అల్పపీడనంపై ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోలు రూములు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సేవలు అవసరమైన ప్రజలు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోలు రూము నంబర్ 93911 85874కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.


సముద్ర తీరంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో రాజు

ముగిసిన భాజపా సభ్యత్వ నమోదు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో భాజపా సభ్యత్వ ప్రక్రియ ముగిసిందని భాజపా నియోజకవర్గం కన్వీనర్ మేకల సతీశ్ కుమార్ తెలిపారు. నరసాపురం మండలం సరిపల్లిలో చివరి రోజు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో భాజపా సభ్యత్వ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. కొత్తోటలో వీరవల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి తదితరులు పాల్గొన్నారు.

● మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాజపా మండలశాఖ అధ్యక్షుడు కవురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కల్వర్టు శిథిలమై.. దారిలో కలిసిపోయి..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: స్థానిక బంగారువారి వీధి అన్నదాన సమాజం భవనం వద్ద డ్రెయిన్‌పై ఉన్న కల్వర్టు శిథిలమై రహదారిలో కలిసిపోయినా.. పునర్నిర్మాణానికి ఎవరూ చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలోని మహాత్మాగాంధీ ప్రధాన రహదారి నుంచి బస్టాండ్‌కు చేరుకోవడానికి, ఈ ప్రాంతంలో అనేక మంది వస్త్రాలు కొనుగోలు చేయడానికి కూడా ప్రయాణిస్తుంటారు. డ్రెయిన్‌పై ఉన్న కల్వర్టు శిథిలమై మురుగు ముందుకు వెళ్లక అధ్వానంగా ఉంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటుందని చెబుతున్నారు. కల్వర్టు నిర్మాణానికి ఎవరు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ పరిస్థితిపై డీఈ రాజ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా తమ దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బదిలీ

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ఆర్‌డబ్ల్యూఎస్ పెనుమంట్ర ఏఈగా పనిచేసిన సూర్యనారాయణరాజు భీమవరంలో డివిజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెనుమంట్ర సచివాలయం-1 ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్యామ్ మణికంఠకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. పెనుమంట్ర పంచాయతీ కార్యదర్శి సీతారామారావుకు ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

మొగల్తూరు, న్యూస్‌టుడే: నివాసాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. మొగల్తూరు కడలివారి వీధిలో ప్రైవేటు దుకాణ సముదాయంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తుతాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుతో తాము కొంత ఇబ్బంది ఎదుర్కొన్నామని, ప్రైవేటు మద్యం దుకాణం ఏర్పాటుతో ఆ ఇబ్బందులు మరింత పెరుగుతాయని, తమకు, తమ సామగ్రికి రక్షణ ఉండదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల అధికారులకు వినతిపత్రం అందించామని తెలిపారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న గ్రామస్థులు

17నుంచి ఉపాధి పనుల గ్రామ సభలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకానికి సంబంధించి రాబోయే వార్షిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి గ్రామ సభ ఆమోదం కోసం ఈ నెల 17 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శర్మ తెలిపారు. ఈ నెల 26 వరకు గ్రామాల వారీగా ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఈ సభలు జరుగుతాయని చెప్పారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

మధుమేహ వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సుబ్బారావుపేట కమల ఆసుపత్రిలో వైద్యుడు నార్ని భవాజీ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. సుమారు 180 మంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి మందులు అందజేశారు.

ఆరుగొలనులో అన్నసమారాధన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులోని విజయదుర్గమ్మ ఆలయంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంజనేయుడికి విశేష అలంకరణ

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి పెద్ద వంతెన వద్ద కొలువైన పంచముఖ ఆంజనేయుడికి మంగళవారం తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి రామాచార్యులు విశేష అభిషేకాలు చేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

పెంటపాడు న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు మండలం యానాలపల్లి ఎస్సీ కాలనీలో డ్రెయిన్లు వ్యర్థాలతో మేట వేశాయి. దోమల సమస్య అధికంగా ఉంది.
- రమేశ్, గ్రామస్థుడు

సమాధానం : దోమల మందు పిచికారీ చేస్తాం.
- నాగదేవి, పంచాయతీ కార్యదర్శి

సమస్య : నవాబుపాలెం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే రహదారి పెద్దపెద్ద గోతులుపడి అధ్వానంగా ఉంది. రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- సుదర్శన్ వెంకటాచార్యులు, కృష్ణయ్యపాలెం

సమాధానం : మరమ్మతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.
- రవిబాబు, ఏఈ, ర.భ.శా

భాజపాతోనే దేశాభివృద్ధి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రధాని మోదీ పాలనపై ప్రజలు ఆకర్షితులై భాజపా సభ్యత్వం తీసుకుంటున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి వెంకటరెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం మండల అధ్యక్షుడు వెంకట స్వామి ఆధ్వర్యంలో దువ్వలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. 200 మంది సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు లక్ష్మణకుమార్, ఎస్సీ సెల్ మోర్చా ఉపాధ్యక్షులు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ఎక్కడి నిర్మాణాలు అక్కడే..!

☛ ప్రజల వద్దకే పాలన అంటూ గత సర్కారు హడావుడి ☛ మొండిగోడలకే పరిమితమైన భవనాలు



రేలంగిలోని వెల్‌నెస్ కేంద్రం ››› నిర్మాణ పనులు బెస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయాయి. స్థానిక ఆర్‌ఎస్‌కే వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇరగవరం మండలంలో ఇదే అతిపెద్ద మేజర్ పంచాయతీ. సుమారు 15 వేల వరకు జనాభా ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గ్రామంలో నిర్మాణం చేపట్టకపోవడంతో వ్యవసాయ, ఆరోగ్యం సిబ్బంది ఒకేచోట నిర్వహించడంతో అవస్థలు తప్పడంలేదు.




ఇరగవరం మండలం భవనం ››› ఇది. రూ. 21.80లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. మొదట్లో పనులు చురుగ్గా సాగినా.. గుత్తేదారునికి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయింది. నిర్మాణం పూర్తికాకపోవడంతో సిబ్బంది చిన్న గదిలో విధులు నిర్వహించాల్సి వస్తుంది.

ఆరంభ శూరత్వంగా.. ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన చేరువ చేసేందుకు గ్రామాల్లోని జనాభా శాతాన్ని బట్టి భవనాలు మంజూరు చేశారు. ఒక్కో సచివాలయానికి రూ. 40 లక్షలు, ఆర్‌ఎస్‌కేకు రూ. 21.80 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ. 17.5లక్షల అంచనా విలువతో శంకుస్థాపనలు చేశారు. సచివాలయాల నిర్మాణానికి ఉపాధి పథకం నుంచి నిధులు కేటాయించారు.

వేల్పూరు, తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పాలనను ప్రజలకు చేరువ చేసేశామని గత నాయకుల మాటలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు అందుబాటులో ఉంటామంటూ సచివాలయ వ్యవస్థ, మెరుగైన వైద్య సేవలు అందిస్తామంటూ వెల్‌నెస్ కేంద్రాలు, రైతులకు అండగా ఉంటమంటూ ఆర్‌ఎస్‌కేలను తెరపైకి తెచ్చారు. తణుకు నియోజవకర్గంలో తణుకు, ఇగరవరం, అత్తిలి మండలాలకు సంబంధించి సచివాలయాలు 55, ఆర్‌కేసీ 55, వెల్‌నెస్ కేంద్రాలు 40 మంజూరు చేశారు. అయితే చాలా వరకు నిర్మాణాలు పూర్తికాకపోవడంతో చాలీ చాలని ఇరుకు భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది.



అత్తిలి మండల కేంద్రంలోని సచివాలయ భవనం ఇది. భవన నిర్మాణం పూర్తయినా లోపల ఫ్లోరింగ్, కరెంటు, నీరు తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తే భవనాన్ని వినియోగించుకోవచ్చు.



సచివాలయనికి సంబంధించి డిజిటల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇంజినీర్, సర్వేయర్, వెల్‌ఫేర్ అసిస్టెంట్.. ఆర్‌ఎస్‌కేకు అగ్రికల్చర్ అసిస్టెంట్, వెల్‌నెస్ సెంటర్‌కు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. ఒకే గదిలో వివిధ శాఖల సిబ్బంది కలిసి పని చేయాల్సిన పరిస్థితి. పలు చోట్ల పాత శిథిల భవనాలు కేటాయించడంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

18 నుంచి గ్రామ సభలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికి 18 నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తణుకు, ఇరగవరం తహసీల్దార్లు అశోక్ వర్మ, సుందరరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనాల, తేతలి, ముద్దాపురం, ఇరగవరం మండలంలో కె కుముదవల్లి, ఆర్ ఖండ్రిక, తూర్పువిప్పర్రు, కాకుల ఇల్లింద్రపర్రు, గోటేరు, ఏలేటిపాడు, అయితంపూడి, సూరంపూడి, రాపాక, అయినపర్రు, ఓగిడి, కాకిలేరు, కంతేరు, కావలిపురం గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డ్రెయిన్ నిర్మాణాలకు భూమి పూజ

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలంలో డ్రయిన్‌ల నిర్మాణాలకు తెదేపా నాయకుల ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేపట్టారు. మంగళవారం గుమ్మంపాడులో తెదేపా నాయకులు, గ్రామ రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ అధికారులు డ్రయిన్ల నిర్మాణాలకు భూమిపూజలు చేశారు.

త్వరలోనే ధాన్యం కొనుగోలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ముద్దాపురం రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఏవో కుసుమ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు త్వరలో ప్రారంభమవుతుందని రైతుల సహకరించాలని కోరారు. గోనె సంచులు పంట కోతల ప్రారంభానికి పది రోజుల ముందు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎం రమేష్, పశువైద్యాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణవరపుగ్రంలో 'పొలం పిలుస్తోంది'.. అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: స్వర్ణవరపుగ్రంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం గ్రామ తెదేపా నాయకుడు చెన్నం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు నిర్వహించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు.



ప్రదర్శనలో రైతులు, నాయకులు, వ్యవసాయాధికారులు

చనిపోతున్నానంటూ లేఖ రాసి యువకుడి అదృశ్యం

మియాపూర్, న్యూస్‌టుడే: 'తనకు వ్యాపారంలో సపోర్ట్ లేదని. ఫ్యామిలీని సైతం సరిగ్గా చూసుకోలేపోతున్నాను. చనిపోతున్నాను' లేఖ రాసి ఓ యువకుడు అదృశ్యమయ్యారు. మియాపూర్ ఎస్సై మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం పెంటపాడు మండలం వెస్ట్ విప్పర్రుకు చెందిన కె.ఇల్లెందర్ నారాయణ(34) నిజాంపేట రోడ్డులో భార్య, కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. మయూరినగర్‌లో లాండ్రీ సర్వీసెస్ సెంటర్ నిర్వహిస్తున్నారు. సోమవారం సర్వీస్ సెంటర్‌కని భార్యకు చెప్పి బయటకు వెళ్లారు. ఉదయం 10:30 గంటల సమయంలో భార్య ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ రావడంతో పని వారిని విచారించగా బయటకు వెళ్లినట్లు చెప్పారు. ఇంట్లో 'తాను చనిపోతున్నానని, తన కోసం వెతకొద్దు' అంటూ రాసి ఉన్న లేఖ భార్య గుర్తించింది. మంగళవారం మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పల్లె పండగతో పూర్వ వైభవం : ఆరిమిల్లి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాలకు పూర్వవైభవం వస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇరగవరం మండలం కె కుముదవల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

విజ్ఞాన గని అబ్దుల్ కలాం

తాడేపల్లిగూడెం అర్బన్, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని రిజిస్ట్రార్ దినేశ్‌శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు, విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రక్షణ, అంతరిక్ష పరిశోధన సంస్థల్లో కలాం విశేష సేవలు అందించారన్నారు. విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ★ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ★ విజ్ఞాన గని కలాం అని సాహితీ సామ్రాజ్యం వ్యవస్థాపకుడు తాడినాడ భాస్కర రావు కొనియాడారు. సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో మంగళవారం తణుకులోని సాయి చిల్డ్రన్స్ క్లినిక్ వద్ద కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త , మానవతావాది రతన్ టాటాకు శ్రద్ధంజాలి ఘటించారు. శిశు వైద్య నిపుణులు టంగుటూరి సుబ్రహ్మణ్యం, వైద్యులు వెంకట రాజు, రామదాసు, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ యోహను ఘనంగా సత్కరించారు.



నిట్‌లో ఆచార్యులు, విద్యార్థులు



తణుకు: సత్కారం పొందిన వైద్యులు

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే : ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో 1, 2లు శ్రీనివాస్, రామకృష్ణ అన్నారు. మంగళవారం పెంటపాడులోని భవిత కేంద్రంలో 'అభ్యసనా వైకల్యాలు'పై దివ్యాంగులు, తల్లితండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. సమగ్రశిక్ష జిల్లా సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, షేక్ మస్తాబీ, తదితరులు పాల్గొన్నారు. ★ అభ్యాసన సమస్య ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని సహిత విద్య జిల్లా సమన్వయకర్త సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సుబ్బారావు పేట భవిత దివ్యాంగుల పాఠశాలలో అభ్యాసన పిల్లల సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



తాడేపల్లిగూడెం: కార్యక్రమంలో పాల్గొన్న సుబ్రహ్మణ్యం, విద్యార్థులు

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి ఎంపీయూపీ పాఠశాలలో మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో 14 నుంచి 18 వరకు అయిదు రోజుల పాటు అభ్యాసన వైకల్యంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భవిత ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు రమేశ్, ప్రసాద్ మాట్లాడారు.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: భవిత కేంద్రంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఇరగవరం ఎంఈవో శ్రీనివాసరావు కోరారు. ఇరగవరం భవిత కేంద్రంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభ్యాసనా వైకల్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో 14న నిర్వహించిన జిల్లా స్థాయి యోగ పోటీల్లో దండగర్ర జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పసుపులేటి రాజేశ్ ప్రథమ, రాపాక వినయ్ తృతీయ స్థానాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బాలికల విభాగంలో అర్జుల మానస ప్రథమ స్థానం సాధించారని వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తణుకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. మృతుడికి సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. 34వ వార్డు సచివాలయ రెవెన్యూ కార్యదర్శి లక్ష్మి వెంకట ధానేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలో.. మండపాక పంట బోదెలో గుర్తు తెలియని మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు గ్రామీణ ఎస్సై మూర్తి తెలిపారు.